

కథ 2008

**4**

# నమ్మకం

## మధురాంతకం నరేంద్ర

"ఇం టి ముందర షామియానా యేసుండేది గూడా కనబడలేదా నీకు? ఇంకా యేడికి పోతుండావు? వోల్డాన్ వోల్డాన్..." అంటూ ఆటోడ్రైవరు భుజం పైన చేయి వేసి గట్టిగా నొక్కుతూ పొలికేక పెట్టాడు గంగయ్య.

ఎండను జల్లెడ పడుతున్న రంగుగుడ్డల షామియానా కింద, నీడను కొలిచి దాని కేంద్రమేదో కనిపెట్టినట్లున్న చోట, మండి బూడిదైపోతున్న కట్టెపేళ్లలోంచీ, తెల్లటి పొగ నిస్సారంగా వెలువడుతోంది. దానికి బారెడు దూరంలో ఇంటి గడప ముందు మనుషుల పాదాల కింద పడి నలిగిన పూలమాలొకటి అస్తవ్యస్తంగా పడి ఉంది. ఇంటి లోపలి నుంచి రెండు మూడు బొంగరు గొంతులు తోచీతోచనట్టుగా రాగాలు తీస్తున్నాయి.

షామియానా నీడపైన అలిగి వక్కకెళ్లిపోయినట్టుగా, వీధికి అటు చివరలో నలుగురు మనుషులు నేలపైన గొంతుక్కూచుని, మట్టిలో గీసిన గీతలపైన నక్కాముట్టి ఆడుకుంటున్నారు.

"నీ మాదిరి పార్టీ దినానికొకటి దొరికితే సాలు నా ప్రాణం తీసేదానికి... దగ్గిర దగ్గిర్నే అని చెప్పి ఊరంతా తిప్పించినావు. బిన్నాగా దిగుతావా లేకపోతే ఆ సామాన్లతో నిన్ను గూడా కిందికి దిగ్గొలకమంటావా?" అంటూ ఆటోడ్రైవరు హుంకరించాడు.

ఆటో శబ్దం విని ఇంటి లోపలి నుంచి బయటికొచ్చిన వ్యక్తి, "ఎప్పుడనంగా పోయినోడివి! ఇప్పుడా తిరుక్కోని వస్తా ఉండావు? ఇంతసేపు యేడ అరుట్లు గొట్టినావు?" అని అడిగాడు కోపంగా.

అతడికేసి విస్తుపోయి చూశాక, బలవంతంగా పెదవులు సాగదీసి, "యిహీహీ..." అని యెబ్బెట్టుగా నవ్వేశాడు గంగయ్య. ఇంకా నేలపైనే కూచుని ఆడుకుంటున్న వ్యక్తులకేసి తిరిగి, "వొరేయ్! గోయిందు! రత్నం! నర్సింహాం! సిన్నబ్బా! బిన్నగా వచ్చి సామాన్లు కిందికి దించండిరా," అని పిలిచాడు. గుంపుగా కూర్చుని ఆడుకుంటున్న వాళ్లెవరు తల తిప్పలేదు.

ఇంటిలోంచి వచ్చిన వ్యక్తి కోపంతో చివాలున వంగి, నేలపైన రగులుతున్న చెక్కపేడును చేతికెత్తుకుని, "లేచి వస్తారా! లేకపోతే కొరివితో రెండు జాడించమంటారా? వచ్చింది దేనికిరా మీరు? తాగేసి తందనాలాడేదానికా? లేకపోతే కార్యం జరిపించేదానికా?" అని గాండ్రిస్తూ ముందు కురికాడు.

నిప్పు తగలగానే మండుతూ చిందరవందరయ్యే టపాకాయల్లా గుంపులోని మనుషులందరూ లేచి దూరంగా పరుగెత్తారు.

"అన్న చూసేదానికి దరమరాజు మాదిరి కనబడతాడుగానీ కోపమొస్తే ఇలావంతుడేరా!" అన్నాడొకడు దూరంగా పరుగెత్తాక పళ్లన్నీ కనబడేలా పరవశంగా నవ్వుతూ.

"ఈ ఉపద్రం ముసలోడు ఆలిస్యం జేసినాడు గానీ లేకపోతే యీ యరవకంతా పలకలు మొగతావు నుండవాసా..." అంటూ మరొకతను ఆటో దగ్గరికి నడిచాడు.

"మార్కెట్టుకు తోడుగా రమ్మని అడుక్కున్నాను సామీ! ఒక్క గాడిదకొడుకూ రాలేదు. ఒంటిచేత్తో పనులన్నీ ముగించుకు వచ్చేసరికి యీ వేళయ్యింది," గంగయ్య కూడా నవ్వుతూనే ఫిర్యాదు చేశాడు.

"అన్ని పనులకు మా మీదపడి ఏడ్వకపోతే నీకు పొద్దు జరగదా? మీ చిన్నోడు రచ్చపైన యిస్పేట్టాకుల్లో గూసోనుండేది నీ కంటికి అగుపడ్లేదా?" వెక్కిరిస్తున్న ట్లుగా నవ్వుతూ ఇంకొకతను ప్రశ్నించాడు.

"మా చిన్నోడు యిట్టాంటి కార్యాలకు రాడని నీకు తెలవదారా ముఠ్ఠాల్!" అంటూ గంగయ్య తన మీసాలు మెలి వేస్తూ ముందుకో అడుగు ఎగిరి దూకాడు. తరువాత యింటి గల్లాయనకేసి తిరిగి, "వాడు కాలేజీలో చదివినోడు సామీ! ఇట్టాంటి మట్టి పనులకు వాణ్ణి రానిస్తానా చెప్పు?" అని న్యాయం అడిగాడు.

"కమీషన్లో మాగ్గూడా భాగం యియ్యాల్సొస్తదని మార్కెట్టుకు మమ్మల్ని పిలవలేదు. ఇప్పుడు తప్పంతా మా మీదికి తోసేస్తా వుండాడు. ఈ మనిషిని నమ్మనే నమ్మద్దు..." గుంపులోంచి నడివయసు మనిషి అరిచాడు.

"మాది దొంగతనంగా కమీషన్లు దొబ్బుకునే వంశంగాదురా మాదర్చోద్! సామీ, ఈ పోసుగోలు మాటలు చెవినేసుకోవద్దు. ఈ చిన్నబ్బగాడోళ్ల తాత దండాకోరు. వీనబ్బ ముండాకోరు..." గంగయ్య కింది పెదవిని మునిపంట కొరుక్కుంటూ కోపాన్ని వెలి గక్కాడు.

ఆటోలోంచి గంగయ్య అందిస్తున్న కుండను చేతికందుకోకుండా వెనక్కో అడుగేసి, "నన్నేమైనా అను చిన్నాయినా! మా పెద్దోళ్లనన్నావంటే గమ్మునుండను," అని రవాటించాడు చిన్నబ్బ.

"ఇద్దరూ కలిసి ఇంటిదాకా తెచ్చిన కొత్తకుండను యీధిలోనే పగలగొట్టేసేటట్టుండారు. అంతపని గాని జరిగిందంటే, మీ చెమడాలు వలిచేస్తాను," అంటూ ఇంటిగల్లాయన గాలిలోకి చేయి విసురుతూ కొట్ట బోయాడు.

ఠీవీగా ముందుకెళ్లి కుండను రెండు చేతుల్లోకి తీసుకున్నాక, "చావింటి ముందర కొత్తకుండ పగిలితే అశుభం గదన్నా! నా కట్టెలో పాణముండేంత దాంకా అట్టాంటి పని జరగనిస్తానా నేను?" అన్నాడు చిన్నబ్బ హుందాగా.

ఒకతను ఆటోలోంచి గుడ్డసంచిని అందు కున్నాడు. ఇద్దరు వ్యక్తులు గోతం మూటనూ, వెదురు కర్రలను కిందికి దించారు.

వాళ్ల దగ్గర నుంచి ఘాటుగా వస్తున్న వాసనను ఆబగా యెగపీలుస్తూ, "నాకు తెలవకుండా వీళ్లకు అడ్వాన్సిస్తే ఇట్నే అయితింది సామీ! అందరూ అప్పుడే పూటుగా గొంతులదాంకా పట్టించుకునేసినారు. ఇంక వీళ్లను పట్టేదాని కెవురివల్లయితింది?" అని ఇంటి గల్లాయనను నిలదీశాడు గంగయ్య.

చేతుల్లో దుడ్డు పడేదాకా నన్ను నిలవనిచ్చినారా వీళ్లు? మీతో యేగేదానికి నా వల్లగాదు. రేయ్, ఆ మూట, కొయ్యలూ గోడ పక్కన పెట్టుకోండి. ఇంట్లో పీనుగ లేచినప్పుడు మీకా యికయికలు పకపకలూ ఎట్లొస్తాయిరా?" ఇంటిగల్లాయన మండిపడుతూ అందరితో ఒకేసారిగా మాట్లాడటానికి ప్రయత్నించాడు.

ఆటోలోని సామాన్లన్నీ దించేశాక, గంగయ్య ఆటోడ్రైవరుకు డబ్బులిస్తూ మరోసారి అనవసరంగా సకిలించాడు.

"ఇదేందీ?" ఆటో అతను విరుచుకుపడ్డాడు. "తమాసాగా ఉండాదా? గంటసేపు ఊరంతా తిప్పించి ముప్పయ్యిస్తావుండవు. యాభైకి పైసా తగ్గినా ఒప్పు కోను."

"ఇచ్చేయిరా గంగా! ఒప్పుకున్న బేరానికి కట్టు బడాలా... మాట తప్పేది యిధాయికంగాదు..." గుంపు లోంచి ముసలతను దగ్గరికొచ్చాడు.

గంగయ్య అతణ్ణి మింగేసేలా చూస్తూ, "నీ కొడుకుల వాయుసుండే వాళ్లతో జేరుకొని పీకలదాకా మందుగొట్టేసినావు. ఇప్పుడు మద్దిస్తానికి నిన్నెవురు పిలిచినార్రా నర్సింహా!" అని రెట్టించాడు.

ఆటోడ్రైవరు ఇంటిగల్లాయనకేసి తిరిగి, "పోతే పోనీ ముసిలోడుగదా అని, సావు సామాన్లని గూడా అనుకోకుండా యాభైకి ఒప్పుకున్నాను. ఇట్నే కొంచెం సేపు నన్ను నిలబెడితే వెయిటింగు చార్జీగూడా వసూలు జేసి తీరతాను," అన్నాడు కచ్చిగా.

ఇంటిలోపలి నుంచి నలిగిన దుస్తులతో వచ్చిన యువకుడు ముఖం చిట్లించుకుని, "రావుకాలం లోపల ఎత్తేయ్యాలా. ఇంకా వీళ్లు మొదలుపెట్టలేదా బాబాయ్!" అని ప్రశ్నించాడు.

"తుమ్మలగుంట మాలోళ్లతో పనంటే తుమ్మ కంపల్లో చిగులుకున్నట్లేరా నాయినా అంటే వింటివా నువ్వు? వీళ్లేమైనా పనిలోకి ముగస్తావుండారా చూడు. రేయ్ గంగా! నీ సొంత దుడ్డిస్తావుండే వాని మాదిరిగా గునుస్తావేందిరా నువ్వు? ఆటోను పంపించేసి బిన్నాగా పన్లోకి దిగండి..." అంటూ ఇంటిగల్లాయిన రుసరుస లాడాడు.

"మీ దుడ్డయితే మాత్రం ఊరికే వచ్చిందా సామీ? సెలవు జేసేటప్పుడు దుడ్డెవురిదైనా కిందా పైనా

సెలవు చూసుకోని సెలవుజెయ్యాల,'' అన్నాడు గంగయ్య ముఖమంతా నవ్వు జేసుకుంటూ. చొక్కా జేబులోంచి మరో అయిదు రూపాయలు తీశాక, ''మొత్తం నలభై అయిదైంది. దీంతో సంతోసంగా యెల బారిపోన్నా!'' అని ఆటోడ్రైవరును ప్రాధేయపడ్డాడు.

ఆటోడ్రైవరు ఒప్పుకోనన్నట్లుగా చేయి తిప్పాడు.

నలిగిన తెల్లరంగు గొడుగులాగున్న పాంటు జేబులోంచి పదిరూపాయల కాగితాన్ని పైకి తీసి ఆటోడ్రైవరుకిచ్చాక, ''నువ్వు బయల్దేరు... మాకు చానా పన్లుండాయి,'' అన్నాడా యువకుడు.

ఆటోడ్రైవరు వొకచేత్తో పదిరూపాయలందుకుని, మరోచేత్తో గంగయ్య చేతిలోని డబ్బుల్ని వూడబెరుక్కుని సరసరా ఆటోలోకి దూరేశాడు.

''యాభై అయిదు లాక్కునేసినావు. ఆ అయిదు నాదీ... నాకిచ్చేయి,'' అని గొల్లుమని అరుస్తూ గంగయ్య ముందుకురికాడు. అందకుండా పరుగెడుతున్న ఆటోవైపుకు, ''నా అయిదు... నా అయిదు...'' అని పరుగెత్తబోయి కాలు కొట్టుకోవడంతో ముందుకు తూలిపడబోయాడు.

''రంపు జెయ్యకుండా పనిలోకి దిగండి,'' అని గొడుగు పాంటు యువకుడు కసిరాడు. ''దుడ్డు కోసరం యిదైపోకుండా అన్నీ సక్రమంగా జరిపించు బాబాయ్! ఏదైనా రిమార్కొస్తే ఒప్పుకోనని ఇప్పుడే రాహుల్ ఫోన్ జేసినాడు,'' అంటూ ఇంటిగల్లాయనను హెచ్చరించాక, అతను లోపలికి వెళ్లిపోయాడు.

అతడివైపు చురచుర చూశాక, ''అమెరికా దుడ్డు ఊరికే వస్తా ఉంటే నేను గూడా ఇంకా పొడుగ్గానే మాట్లాడతాను,'' అన్నాడు ఇంటిగల్లాయన. తరువాత వెనుదిరిగి, ''రేయ్! మీ వల్ల నా మీద మాట పడతా వుండాది. వొళ్లు దగ్గర బెట్టుకుని పని చెయ్యండి. నాక్కోపం వచ్చిందంటే మీ తుమ్మలగుంటోళ్లను యీ పక్క కార్యాలకు అడుగుబెట్టనీకుండా జేస్తాను.'' అని బెదిరించాడు. అతను ముఖం చిట్లించుకుని లోపలికెళ్లిపోగానే రత్నయ్య, ''నా అయిదు... నా అయిదు,'' అని గంగయ్యను అనుకరిస్తూ ఎగతాళి చేయసాగాడు.

గంగయ్య కొడతానన్నట్టుగా చేయి విసురుతూ, ''బొత్తిగా చిన్నాపెద్దా లేకుండా పోతా ఉండాదిరా నీకు! ఈ దండగ పనులు జేస్తే ఈ పనులు గూడా లేకుండా పోతాయి జూసుకో! నోట్లోకి అయిదు వేళ్లూ పొయ్యే తెరువేందో తెలుసుకోని బతకండి...'' అన్నాడు. గోడ పక్కన కూర్చుని బీడీ వెలిగించుకున్నాక, ''నా పెద్ద కొడుకేడ బోయినాడ్రా?'' అని నర్సింహులును అడిగాడు.

బుగ్గలు నొక్కులు పడేలా దమ్ములాగాక, ''ఇంకా యేడుండాడు? ఎప్పుడో యెలబారిపోయి నాడు,'' అన్నాడు నర్సింహులు. ''పనిలోకి దిగేటప్పుడు కొంచేపు కనబడతాడు. మల్లంక సడీసప్పుడు లేకుండా మాయమైపోతాడు. వాడు గూడా వచ్చినాడని చెప్పి నువ్వు రెండు భాగాలు దొబ్బేస్తావు. పని వొప్పించు కునింది గూడా నువ్వే అని చెప్పి పినపెద్ద భాగంగా ఇంకొంచెం వూడబెరుక్కుంటావు. ఎప్పుడూ జరిగే భారతమే గదా యిది! కొంచెం యామారితే నీ చిన్న కొడుకును గూడా వచ్చి పొమ్మని చెప్పి, ఇంకో భాగం కూడా అడిగేటట్లుండావు.''

గంగయ్య గుడ్డసంచిలోంచి కత్తిని తీసి నేలపైకి విసిరేస్తూ, ''ఇట్లాంటి పనులకు నా చిన్నకొడుకు రమ్మంటే గూడా రాడు. వాడు కాలేజీలో సదివింది మీ మాదిరిగా మన్నుల్లో దొర్లేదానకా?'' అని ఎద్దేవా చేశాడు. చిన్నబ్బ వెదురుకర్రను తీసుకుని, దాని బుడిపెలను కత్తితో జివరసాగాడు. రత్నం పెద్దగా నవ్వి, ''వొక కత్తితో పని జరిగితిందా?'' అని అడిగాడు.

అతడి మాటలు పట్టించుకోకుండా, ''అవిలాల మాలోళ్లను పిలుచుకోనుంటే తెలుసుణ్ణు. ఈ యరవకు వాళ్లు ఇంటి ముందర వుప్పరపట్టే ఆడేసుందురు,'' అని గొణిగాడు గంగయ్య.

నర్సింహులు అతడికేసి నివ్వెరపోయి చూసి, ''అవిలాల మాలోళ్లయితే మాత్రం ఒక కత్తితో పనంతా యెట్టాజేస్తార్రా? మనూరి నుంచి చెంగడోళ్ల మనుషుల్ని రప్పించుండినా, రెండో కత్తి లేకుంటే పంచేటయి తింది,'' అన్నాడు.

బీడీ పొగ గొంతులోకి దూరడంతో గంగయ్య పొడిదగ్గు దగ్గుతూ, ''వాళ్ల ముగం! వాళ్ల చేతల్లో అయిదు కత్తులున్నా, మన దగ్గిరుండే ఒకదాన్తో సమాన మయితిందా? మనం నాయింగా పోతావుండామని, గిచ్చిగిచ్చీ బేరమాడకుండా పనుల్లోకి దిగతావుండా మని, మనమంటే లెక్కలేకుండా పోతావుండాది. అవి లాళ్లతో పడిలేస్తేగానీ మనమంటే ఏందో వీళ్లకు తెల వదు,'' అన్నాడు. తర్వాత తనలో తానే మాట్లాడుకుంటు న్నట్టుగా, ''వీళ్లదంతా అయింబుకారి బుద్ధి. కర్మాంతరా లప్పుడు మనల్ని తలవనుగూడా తలవరు. అప్పుడు ఆ మంగలోళ్లూ, బాపనోళ్లు అడిగిందంతా చేతులు గట్టు కొని చచ్చినట్టు ఇస్తారు,'' అని గొణిగాడు.

"పెండిండ్లూ దేవర్లకూ, కర్మాంతరాలకు వచ్చి రకరకాలుగా దుడ్లు దండుకునే బాపనోళ్ల కండ్లెందుకో ఈ చావుల మింద పడ్లేదు. లేకపోతే వాళ్లు యీ సంపాదన గూడా మనకు దక్కనిచ్చుండరు," అన్నాడు నర్సింహులు.

"వాళ్లంతా తెలివయినోళ్లురా! యీ మాదిరి కస్మాలం పనుల్నంతా మనకిచ్చి, జబర్దస్తీగా తిరిగే పన్లంతా వాళ్లు దొబ్బేసినారు," అన్నాడు గంగయ్య కోపంగా. తరువాత గొంతుక్కూచుని బీడీ గాల్చుకుంటున్న గోవిందయ్య కేసి తిరిగి, "రేయ్! గోయిందూ! గమ్మునా యెట్లా గుచ్చుంటావురా? ఆ దారాల్ని రాయితో నరుకు," అని పెద్దగా కసిరాడు.

అప్పుడప్పుడూ వీధిలోకొస్తున్న సైకిళ్లు, స్కూటర్లు నడివీధిలో మండుతూ పొగలు వదులుతున్న చెక్క పేళ్లను చూడగానే కంగారుపడిపోయి, పక్కకు తిరిగి వేగంగా ముందుకెళ్లిపోతున్నాయి. పొరుగింటి నుంచి వచ్చిన ఓ ముసలావిడ నీరసంగా షామియానా దగ్గరికి నడుస్తోంది. ఇంటిలోపలి నుంచి వీధిలోకి వ్యాపిస్తున్న నిశ్శబ్దం క్రమక్రమంగా బరువెక్కుతున్నట్టుగా అనిపిస్తోంది.

"ఈ పక్క ఎస్వీనగరం కాన్నించీ, ముత్తాలరెడ్డి పల్లెదాకా మన తుమ్మలగుంటోళ్లకు వాడిక. దాంట్లో మజ్జిగ కాలవకు వుత్తరం ఏరియా మనది. అవతలి కుండేది చెంగడోల్లది. పెద్దపెద్దోళ్ల కాలం నుంచి వస్తా వుండే న్యాయం ఇది. మన పనుల్లోకి ఇంకొకడు చెయ్యి పెడితే గొమ్మునుంటానా? అడ్డంగా నరికి పారేస్తా దానెమ్మ!" నర్సింహులు నాలుకను పైపంటితో అణిచి పెడుతూ, కోపంగా గాండ్రించాడు. అతడి నల్లటి ముఖంపైన చెమట ధారలుగా పాకుతోంది. నిగనిగలాడుతున్న నర్సింహులు ముఖంకేసి చూస్తూ, "మందు జాస్తీ అయినట్లుండాది. పెగ్గి పెరిగిపోతుండాది," అని గొణిగాడు గంగయ్య.

ఒకదాన్నొకటి అతుక్కున్నట్టుగా కట్టిన ఇండ్ల వరసలతో వీధి సన్నగా బక్కచిక్కి పోయినట్లుగా కనబడుతోంది. అక్కడక్కడా ఆకులు రాల్చుకున్న చెట్లు పైకెత్తుకుని ఏదో ఫిర్యాదు చేస్తున్న వ్యక్తుల్లా వెలవెలబోతున్నాయి. ఎండకు భయపడి ఇళ్ల లోపలి వ్యక్తులెవరూ బయటకు రావడంలేదు. పరుగెత్తుకుంటూ వచ్చిన వీధికుక్కలు రెండు షామియానాకి అవతల నిలబడిపోయి, నాలుకలు బయటకు వేలాడేసుకుని రొప్పసాగాయి. చిన్నబ్బ చేతికి దొరికిన రాయిని బలం కొద్దీ వాటివైపుకు విసిరాడు. కుక్కలు రెండూ పెద్దగా గెంతి, మొరుగుతూ దౌడు తీశాయి. అతడి పక్కన నిల్చుని కొబ్బరి దారాలను నిగ్గ చేస్తున్న రత్నం, "వానెక్క!... భలే గురిరా నీది!" అని మెచ్చుకున్నాడు.

"తుమ్మలగుంట కాప్పల్లెకు కూతవేటు దూరంలో మన పల్లె ఎందుకుండేది?" పారిపోతున్న కుక్కలను చూసి దర్పంగా నవ్వేశాక నర్సింహులు వాదించసాగాడు. కాపోళ్లకు కయ్యా కాలువలున్నప్పుడు సేద్యం పనులు జేసిందెవురు? మనమా? అవిలాలోళ్లా? ఇప్పుడైతే ఆ పక్క పెరుమాళ్లపల్లి కాన్నుంచీ, ఈ పక్క తిరచానూరు దాకా కయ్యల్ని అమ్మేసి, ఇండ్లు గట్టేసినారనుకో! అంత మాత్రాన మన పాయకట్టులో వుండే పనులు మనవి గాకుండా పోతాయా? మనమేగాని లేకపోతే ఈ తావులో మట్టి పనులు చేసే దిక్కెవరు? సావుకార్యాలు నిభాయించే మనిషెవుడు? ఇదంతా మన తాత ముత్తాతలు రెక్కలు ఇరుసుకొని, సంగటి తిన్నతావు గదరా? దీంట్లోకి ఇంకొకణ్ణి అడుగుబెట్టనిస్తామా ఇంత బతుకు బతికి!"

"ఒరే నర్సింహా! మా నాయిన చెప్పేటోడు..." అంటూ గంగయ్య ఉత్సాహంగా అడ్డు తగిలాడు. "ఈ పక్క రైలు రోడ్డు కానుకోని వుండే మామిడితోపులో పొదులు దవ్వుతా ఉన్నప్పుడేనంట మా తాతను పురుగు ముట్టింది. యాడనుకోనుండావు? సరింగా ఇప్పుడు ఎల్.బి. నగర్ మాలోళ్లు గంగమ్మను తీరుస్తారు జూడు, అదే తావులో..."

"మా నాయిన పక్కనుండే ముత్తాలరెడ్డి మడికట్లలో వుండే మిషన్ షెడ్డులోనేనంట పుట్టింది," నర్సింహులు తెల్లటిమీసాలను పడి తిప్పుతూ అందుకున్నాడు. "ఆ పొద్దు గూడా మా అవ్వ మడి నాటటానికి పనికొచ్చిదంట! అక్కడ్నే నొప్పులొచ్చి అక్కడ్నే తీర్థ మాడిందంట. అప్పుడే పుట్టిన బిడ్డను చంకనేసుకుని చక్కా ఇంటికెలబారిపొయ్యిందంట! చూసినోళ్లంతా రెప్పాలోళ్ల కోడలు సటపటమైంది గాదని ముక్కుపైన యేళ్లేసినారంట! యేడనో తెలుసునా? సరింగా ఆ షెడ్డున్న తావులోనే ఇప్పుడు భజనమందిరం గట్టుండారు."

"చిన్నబ్బ గాడొకడే వెదురు జీలుస్తా వుండాడు. వాళ్లిద్దరూ అదే పనయినట్టు బీడీలూది పారేస్తా వుండారు. ఈ పిల్లోళ్లు మనకాలమయిపోయినంక మన పేరు నిలబెట్టేట్లు లేరు," అంటూ గంగయ్య కోపంగా పైకి లేచాడు. 'రేయ్ గోవిందూ, రత్నం! బిన్నాగా సవారీ

గట్టండి. ఈడికొచ్చింది సట్టంగా అరుట్లు గొట్టేదానికి గాదు,'' అని కేకేశాడు.

''అప్పటికి మీరిద్దరూ నీడలో గుచ్చోని చేస్తా వుండే పనేంది మామా?'' అని వెంటనే సవాలు విసిరాడు గోవిందయ్య.

నల్లరంగు మోటారుసైకిలొకటి వీధిలో ఎవరు అడ్డం రాకపోయినా పెద్దగా హారను మోగిస్తూ వచ్చి షామియానా కింద ఆగింది. తెల్లటి ఖద్దరు చొక్కా పాంటూ తొడుక్కున్న నల్లటి యువకుడొకడు రెండు మూడు మడతలుగా వేసి పట్టుకున్న పూలమాలతో సహా మోటారుసైకిలు వెనుక సీటుపై నుంచి కిందికి దిగాడు.

గంగయ్య చేతిలోని బీడీని దూరంగా విసిరేసి ఉత్సాహంగా పైకి లేచి, ''అర్రర్రే! మోహన్‌రెడ్డన్న!'' అని అరిచాడు.

మోహన్‌రెడ్డి ఇంటిలోపలికెళ్లి పోయాడు. మోటారుసైకిలు హేండిలు పట్టుకుని కాళ్లు నేలపైకి చాపుకుని, అలాగే సీటుపైన కూర్చున్న యువకుడి దగ్గరకెళ్లి, ''అన్నకు వాళ్లు బంధుగులా?'' అని అక్కరగా అడిగాడు గంగయ్య.

అతను తల అడ్డంగా తిప్పి, ''స్నేహితం,'' అన్నాడు. మోటార్‌సైకిలుపై కూర్చున్న వ్యక్తి జేబులోంచి సిగరెట్టు పెట్టెను పైకి తీసుకుని, వెంటనే తలూపుకుంటూ దాన్ని మళ్లీ జేబులోకి తోసేశాడు.

ఇంటిలోపల నుంచి తిరిగొచ్చిన మోహన్‌రెడ్డితో బాటు వెనకే ఇద్దరు వ్యక్తులు బయటికొచ్చారు.

''పొద్దున్నే వచ్చినా హైదరాబాదు నుంచీ, మళ్లా ఇప్పుడు అర్జెంటు మీటింగు... దానం జేసే టయానికి వస్తా...'' అని చెబుతూ మోహన్‌రెడ్డి మోటర్‌సైకిలు వెనక సీటు పైకి శరీరాన్ని చేరవేశాడు.

గంగయ్య రెండు చేతులూ జోడించి, పెద్దగా పళ్లికిలిస్తూ ముందుకొచ్చి, ''అన్నా! నేను గంగయ్య! రెప్పాలోళ్ల గంగయ్య,'' అని పలకరించాడు.

మోహన్‌రెడ్డి ప్లాస్టిక్‌డబ్బాలోంచి నల్ల కళ్లద్దాలు తీసి, నాజూకుగా ముఖానికి తగిలించుకున్నాడు.

''మా చిన్నోడికి ఉద్దోగం అన్నా... మూడువారాలకు ముందర ఇంటికాడికొచ్చినాను... మూడువేల రూపాయలు...''

మోహన్‌రెడ్డి వులిక్కిపడి తిరిగి చూసి, ''నువ్వా? ఆ మాట ముందుగా జెప్తేగదా గెవనం వచ్చేది? ఆ పని పైనే వుండాల్లే! మల్లంక అగుపించు,'' అన్నాడు. నల్లటి పొగల్ని విడిచిపెట్టాక మోటరుసైకిలు ముందుకు పరుగెత్తింది.

''పనంతా అట్నే పడుండాది. ఇంత తూగుముగం పనోళ్లను నేనెప్పుడూ జూల్లేదు,'' అంతవరకూ ఇంటి లోపల దాక్కున్న నిశ్శబ్దాన్ని తరిమిగొట్టడం కోసమన్నట్టుగా ఇంటిగల్లాయిన పెద్దగా అరిచాడు.

''యింగ మాదేం పని బాకీ వుండాది సామీ! మా పిల్లోళ్లు సవారీ గడుతూ వుండారు. మీరెప్పుడు చెప్తే అప్పుడు మా పలకలు మోగిపోతాయి,'' అన్నాడు గంగయ్య పెదవులు సాగదీసి నవ్వుతూ.

వెదురుదబ్బలను త్రిభుజాకారంలో కట్టి వాటికి పొడుగాటి దారాలను వేలాడదీస్తున్న నర్సింహులు తమ కేసి విసుగ్గా చూస్తున్న ఇంటిగల్లాయినతో, ''తలకొరివి గూడా రెడీ సామీ!'' అన్నాడు పరవశంగా.

ఇంటిగల్లాయిన ముఖాన్ని చిటపటలాడించుకుంటూ వెళ్లిపోయాడు.

దారాల పొడవును చేతిజానలతో కొలుస్తున్న నర్సింహులు పక్కకెళ్లి కూర్చుని, ''మోహనరెడ్డన్నను జూస్తివారా నర్సింహా! ఆ రూపు, గుణమూ అట్నే వాళ్ల నాయిన మాదిరే దిగబడినాడు. ఎప్పుడూ పదిమంది చుట్లా కమ్ముకోనుంటారు. పులిబిడ్డ పులిబిడ్డే!'' అన్నాడు గంగయ్య. బీడీ వెలిగించుకుని రెండు దమ్ములు లాగాక, ''వాళ్ల నాయిన నాకంటే గూడా పసోడు. కాలం తీరి పోయినాడు. పిల్లోడుగా ఉండంగనే ఈ అన్న పైకి కాడి పడింది. తిరుపతికొచ్చే పెద్ద పెద్దోళ్లు గూడా వీళ్లింటికి రాకుండా తిరుక్కొనిపోరు. ఆ ఇంటికాడ వచ్చే జనం, పోయే జనమూ, ఎప్పుడూ తిరణాళ్ల మాదిరిగా వుంటాది. మనూర్లో ముగ్గురు పిల్లోళ్లకు యిస్కూలు అయివోరి వుద్దోగాలు వచ్చిందెవురివల్ల? అన్నగాని లేకుంటే అవి మనూరిదాకా వచ్చుణ్ణా? ఎట్లయినా మా చిన్నోడికి ఏదో ఒక వుద్దోగం తీసిమ్మని తిరగతా వుండాను. కొంచెం ఖర్చయితాదన్నాడు. ఇంత బతుకు బతికి మన కోసరం ఆయన్ను ఖర్చు బెట్టుకొనిస్తామా? ఎంతయినా ఎనకాడేది లేదు బాంచెత్!''

''తూనీమ్మ! పైకి లెయ్యండిరా!'' నర్సింహులు వుగ్రమొచ్చినవాడిలా పైకి లేవడంతో గంగయ్య మాట్లాడ్డం ఆపేశాడు. మళ్లీ నక్కాముట్టి ఆటలోకి దిగబోతున్న వాళ్ల పైకి తుఫానులా విరుచుకుపడ్డాడు. ''పైకి లేచి మంటేసి, పలకలు చేతలకెత్తుకోండి. ఆ కసువు కట్ట ఇప్పి సవారీపైన పరవండి. చెయ్యా లంటే పనేలేదా మీకు?''

''హూ! ఈ కట్టూ గిట్టూ మానం మర్యాదా మనతో గూడా మట్టిగొట్టుకొని పొయ్యేటట్టుండాదిరా నర్సింహా!

వీళ్లిట్నే వుంటే వూర్లో వాళ్లు దిగ్గొలికేస్తారు. మల్లంక వీళ్లు తిరపమెత్తుకొని బతకాల్సిందే!" అంటూ గంగయ్య నిట్టూర్చాడు.

ఇంటిలోపలి నుంచి ఇద్దరు వ్యక్తులు పొడవాటి బెంచిని తీసుకొచ్చి వీధిలో వేశారు. దానిపైకి రాబోయే శరీరాన్ని ఇప్పుడే చూస్తున్నట్టుగా అటే చూస్తూ, "కుక్క పని కుక్క జెయ్యాల, గాడిదపని గాడిదజెయ్యాల!" అన్నాడు నర్సింహులు. "మనం మనకు పెద్దోళ్లు చెప్పేసి పోయిన పనులు చేసుకోని బతకాలగానీ వుద్దోగాలని తిరిగితే ఏమైతందో? ఇందుకేనేమో బమ్మంగారు కలి యుగానికి అంతమని జెప్పేసి పోయుండేది!" నర్సిం హులు వోసారి చుట్టూ తలతిప్పి చూసి, ఎవరు తనను గమనించడం లేదని అనుకున్న తర్వాత, డ్రాయరు లోంచి సీసా తీసుకుని గుటగుటా తాగేశాడు.

"నీ కొడుకులు ముగ్గురికి చదువులు రాలేదని, మావోడు కాలేజీదాంకా ఎక్కొచ్చినాడనీ నీకు కండ్లు కుడతావుండాది లేరా!" అంటూ గంగయ్య రుసరుస లాడాడు. మా చిన్నోడు అందరి మాదిరిగాదు. పొంటేసు కొని తెల్లారితో టౌనుకు పోయినోడు సాయంత్రానికిగానీ యింటికి తిరుక్కోని రాడు. పెద్దపెద్దోళ్లతో సావాసం, సంగటీ సలిబిండీ తినడు. మల్లెపుష్పాల మాదిరి తెల్లం గా అన్నం వండి పెడ్తే రెండు పిడికిల్లు నంజుతాడు. సదువుకున్నోళ్లకుండే తెలివి మొరటుగుంపుకెట్లొస్తది?"

ఇంటిలోపలి నుంచి నలుగురు మొగవాళ్లు శవాన్ని తీసుకొచ్చి బెంచీపైన పడుకో బెట్టారు. కొందరు ఆడవాళ్లు కళ్లు తుడుచుకుంటూ చుట్టూ నిల్చున్నారు. చుట్టుపక్కల ఇళ్లవాళ్లు కొందరు వాళ్ల గడపల దగ్గర నిల్చుని షామియానా వైపుకు బిత్తరచూపులు చూస్తు న్నారు. వీధిలో వేగంగా వచ్చిన స్కూటరొకటి దారి కడ్డంగా నిలబడిన గుంపును తిట్టుకుంటూ ముందు కెళ్తోంది.

గడ్డి పరిచిన వెదురుకర్రల సవారీపైన అరిటా కులు కప్పి టెంకాయదారంతో కట్టసాగాడు నర్సిం హులు. మిగిలిన ముగ్గురూ షామియానాకు అవతల గడ్డిని రగిలించి, పలకలను మంటలపైన కాకెక్కిస్తు న్నారు.

దాదాపు ముప్ఫయ్యేళ్ల వయసున్న యువకు డొకడు గుంపులోంచి గంగయ్య దగ్గరకొచ్చి, "నీది తుమ్మలగుంట గదా! నువ్వు... ఇక్కడ?" అని ఎగాదిగా చూశాడు.

గంగయ్య సవకంతో ముఖం తుడుచుకుంటూ, "నేనే... నేనేసా," అని సిగ్గుపడిపోయాడు. తర్వాత, "ఈ పక్క మట్టిపనులంతా మావేలేసా," అన్నాడు.

అతను ముఖాన్ని ఎర్రబార్చుకుంటూ, "అయితే ఇంటి పిల్లర్లకు ఫౌండేషను గుంతలు తవ్వేదీ, స్మశానంలో సమాధులకు గుంతలు దీసేదీ, రెండూ ఒకటేనా?" అని రెట్టించాడు.

వేడెక్కుతున్న పలకలపైన బోదపుల్లలు మోదు తున్నాయి. శవం దగ్గర నిల్చున్న జనంలోంచి ఎవరో పెద్దగా అరుస్తున్నారు.

"ఛ... ఛ..." అంటూ గంగయ్య నాలుక కరుచు కున్నాడు. "పెండ్లీ చావూ రెండూ ఒకటే ఎట్లవుతాయి సామీ! తవ్వేది గుంతలే అయినా తవ్వే మనుషులు వేరే! ఆ పని జేసేవాళ్లను ఈ పని కాడికి రానీను. వీళ్లను ఆ తావుకు అంపీను. శుభంగా జేసే పన్లంతా నా పెద్ద కొడుకు జూసుకుంటాడు."

"రేపు తెల్లారి అయిదుకు ముహూర్తం. అప్పటికి గుంత రెడీగా వుండాలా..."

"ఈ వేళకు మావోడు ఆ తావులో తవ్వుతా వుంటాడు. మాటిస్తే ఎనక్కు తగ్గే వంశంగాదు మాది."

అతను అనుమానంగా చూస్తూ మళ్లీ గుంపులో కలిసిపోయాడు.

తన పలకపైన అరిచేత్తో దరువేసి చూశాక, "నీ పెద్దకొడుకును ఆ పని పైన అంపిస్తావా మామా." అని అడిగాడు గోవిందయ్య.

"ప్చ్... ప్చ్..." అని పెదవులు చప్పరించి, "ఈ మనిషి ఆ పక్క కుప్పం బాదూర్లో బాంకీ ఆఫీసరంటలే! క్రిష్ణానగర్లో ఇంటిపని మొదులుబెడతా వుండాడు. మేస్త్రీ మునిరత్నంరెడ్డి మట్టిపని నాకిచ్చినాడు. మన కూలీలో గూడా కమీషను గొట్టేస్తాడు ఆ మేస్త్రీ. రేపు తెల్లారితే పూజ. గుంతదవ్వి శంఖుస్థాపనం చెయ్యాల. ఈ పనవ తానే క్రిష్ణానగరుకు పొండి. మార్కింగు జేసిన తావులో గుంత దవ్వండి. ఆ కూలీ దుడ్డు మీకే ఇస్తా..." అన్నాడు.

"ఈ పొద్దుకు ఈ పనీ, ఈ కూలీదుడ్డూ చాల్చాలు. ఇంటికి పోయి రెండు పిడసలు తినేసి పండుకుంటే పాణమేడికి పోతిందో తెలవదు," అని తేల్చిపారేశాడు చిన్నబ్బ.

"అప్పటికి నేనేనా సన్నకష్టం బడుండేదీ? అనా వస్యంగా వొళ్లు నలగ్గుద్దుకునే అగత్యం నాకు లేదు," అంటూ పలక పైన మరో దరువందుకున్నాడు గోవిందయ్య.

"ఈ పొద్దు జరిగిపోతే సాల్లేరా మీకు! రేపుటికింత మిగలబెట్టుకుందామని అనుకోరు," గంగయ్య వాళ్ల వైపుకు ఉక్రోషంగా వురిమి చూశాడు. "మీ కోసరమనే గదా నేను వూరంతా తిరిగి పనులు ఒప్పించుకునేది? పని లేకపోతే ఏడుస్తారు. రెండు పనులొస్తే జారుకుంటారు. ఇప్పుడే కొండలు గొట్టినారని మీ ఒళ్లు అలిసుండేది? మందుపడితే ఇంక మీరు మనుషులే గాదు..."

వున్నట్లుండి పలకపైన పెద్దగా మోదుతూ చిన్నబ్బ అర్థంపర్థం లేని పాటను గొంతెత్తి గీపెట్టాడు. చుట్టూ ఉన్న మనుషులందరూ తనవైపుకు తిరిగి చూడ్డం గమనించగానే అతను మరింత పెద్దగా రాగం తీయసాగాడు.

ఇంటిగల్లాయన గంగయ్య దగ్గరికొచ్చి, "టపాసులెంతకు దెచ్చినావు?" అని అడిగాడు.

"ఆరునూర్లకు తెమ్మంటివి గదా సామీ!" అంటూ గంగయ్య సంచిని చూపెట్టాడు.

"అవి ఆరునూర్లా? సగం బాగ్గుకు గూడా లేవు," ఇంటిగల్లాయన నొసలు చిట్లించుకున్నాడు.

"ఛ...ఛ... టపాసుల్లో కమీషన్లు గొడతానా సామీ! పాపం గదా? సామాన్లపట్టీ అంగిడోడు ఇచ్చింది అట్నే తెచ్చినా... కావాలంటే లెక్క జూసుకో..." అన్నాడు గంగయ్య తన మురికిచొక్కా జేబులోంచి కాగితాన్ని తీసి ఇస్తూ.

"టపాసులు గాల్చేదెవురు?" అని ఇంటిగల్లాయిన నిర్లక్ష్యంగా అడిగాడు.

"నేనే సామీ. అందుకే నేను పలక తేలేదు," అన్నాడు నర్సింహులు ముందుకొచ్చి.

"నువ్వా? పడుసోడైతే ధైర్యంగా కాలుస్తాడు."

"అప్పటికి నేను ముసిలోణ్ణనుకుంటావుండావా సామీ! నా వొయిసెంతను కోనుండావు? బిన్నాగా ఎంటికలు తెల్లగా అయిపోయినాయంతే! ఎంత పెద్ద బాంబునైనా నేను ఎడంచేత్తో కాల్చి పారేస్తాను."

"అన్ని సెంటర్లలో మోగిపోవాలా... మిగలబెట్టుకోని ఇంటికెత్తుకుబోయినావని తెలిసిందనుకో, నేను గొమ్మునుండను."

గుంపులోంచి ఎవరో, "అంత వుడుకుడుగ్గా నీళ్లు బోస్తే ఎట్లా? కొంచెం చల్లనీళ్లు కలపండి," అని అరుస్తున్నారు. మరెవరో, "బతికున్నప్పుడు చల్లనీళ్లే గతి. ఇప్పుడైనా వుడుకుడుగ్గా పోసుకోని..." అని వాపోతున్నాడు. బెంచీపైన శవం పక్కన కూచున్న ముసలావిడ నెత్తిపై కూడా వేడినీళ్లు గుమ్మరిస్తున్నారు. ఆవిడ గడ్డ గట్టుకుపోయిన మంచుబొమ్మలా కనబడుతోంది. అయిదారుమంది కలిసి శవాన్ని సవారీపైకి తరలించారు. ఇంటిగల్లాయిన గంగయ్యకేసి చూశాడు. "కట్టుబోరా నర్సింహా!" అని పురమాయించాడు గంగయ్య. అతను రెండడుగులు వెనక్కేశాడు. "ముందుగా గుర్రమెక్కితే సరిపోతిందా? మినకరించకుండా పనిజెయ్యి," అని కసిరాడు గంగయ్య.

"బజారునించీ వస్తావస్తా నువ్వు గొమ్మునా వచ్చుంటావా? దోవలో గొంతుదాంకా పట్టించుకోనొచ్చుంటావు," అంటూ నర్సింహులు రోషంతో బుసలు కొట్టాడు.

"రావుకాలం వస్తా వుండాది. బిన్నాంగా రండ్రా!" ఎవరో గాండ్రిస్తున్నారు. నర్సింహులు గంగయ్యను మింగేసేలా వురిమి చూస్తూ శవం పక్కన గొంతుక్కూచుని సవారీ గట్టసాగాడు.

గంగయ్య చేతిని పట్టుకుని షామియానా కవతలికి లాక్కెళ్లాడు రత్నయ్య. పంచెకిందున్న గాడాగుడ్డ డ్రాయరు జేబులోంచి జానెడు పొడవున్న సీసాను పైకి తీసి, "నీ భాగం పెద్దాయినా," అన్నాడు.

గంగయ్య గబుక్కున దాన్ని లాక్కుని, "హిహీహీ... నీది పెద్ద బుద్ధిరా! మీ నాయిన గూడా ఇంతే!" అని మెచ్చుకున్నాడు. వీధిలో కాస్త ముందుకెళ్లి, రెండు ఇండ్ల మధ్యలోని మురికి కాలువగట్టు పైకి నడిచాడు. సీసామూత తీసి, గటగటా తాగేశాడు. నోట్లోంచి వేడి వేడిగా ఊపిరి బయటకు వదులుతూ, ఖాళీసీసాను నడుము దగ్గర, పంచ మడతల్లోకి చెక్కేశాడు. అతను షామియానా దగ్గరకొచ్చేసరికి పలకలు బీభత్సంగా మోగిపోతున్నాయి.

యస్వీనగరు వీధి యూనివర్సిటీ రోడ్డు మలుపు తిరిగేచోట పొడవాటి టపాసుల సరాన్ని నేలపైన పరిచి నర్సింహులు వూదుకడ్డీతో రగిలిస్తున్నాడు. నలుగురు మనుషులు శవాన్ని భుజాల పైకెత్తున్నారు. నిలువెల్లా నీళ్లతో తడిసిన ముసలావిడ శరీరం చలికి సైతం వణకడం లేదు. ఇంటిగల్లాయిన గంగయ్యకేసి ఏమిటో అరుస్తున్నాడు. గంగయ్య సంచినీ, కత్తినీ చేతికెత్తుకున్నాక ముసిముసి నవ్వులు నవ్వసాగాడు.

శవంతోబాటు కొందరు మగవాళ్లు మాత్రం ముందుకు కదిలారు. షామియానా కింద మిగిలిపోయిన ఆడవాళ్లు ఏడవకపోతే బాగుండదన్నట్టుగా ముక్కులు నలుపుకుంటున్నారు.

ముందుగా నడిచిపోతున్న పలకలవాళ్లను ఎవరో ఆగమని సైగ చేస్తున్నారు. వాళ్లు దగ్గరికొచ్చాక, "ఎందుకట్ల పరుగెత్తుతారు? మేంగూడా రావద్దా? మెల్లింగా నడవండి," ఆజ్ఞాపించాడో వ్యక్తి. వాళ్లు పెద్దగా నవ్వుతూ సంతోషాన్నంతా పలకలపైన చూపించ సాగారు. అందరికంటే ముందుగా మరో కూడలిని చేరుకున్న నర్సింహులు పెద్ద బాంబును వెలిగించే ప్రయత్నంలో వున్నాడు. ఎదురుగా వస్తున్న కారొకటి రోడ్డు పైన పేలుతున్న టపాకాయల్ని తిట్టాక, శవాన్ని మోసుకొస్తున్న గుంపునకు దూరంగా తిరిగి తుర్రుమంది. ఇంటిగల్లాయన మళ్లీ గంగయ్యకేసి తిరిగి పెద్దగా చేతులూపుతూ ఏదో చెప్పసాగాడు. కత్తిని సంచిలో పడేసి, దాన్ని చంకకు తగిలించుకున్నాడు గంగయ్య. పక్కనున్న వ్యక్తి దగ్గరి నుంచి పూల మాలలున్న గంపను నెత్తికెత్తుకున్నాడు. గంపలోంచి ఓ మాల తీసి శవం పైకి విసిరేశాడు. అది శవం పై నుంచి అటువైపు దొర్లి కిందడిపోయింది. శవాన్ని మోస్తున్న వాళ్లు నలుగురూ కలిసి బృందగానంలా గంగయ్యను తిట్టసాగారు. గంగయ్య మరింతగా సిగ్గుపడిపోయి నవ్వుతూ పూలమాలలను చిన్న భాగాలుగా తుంచి విసరసాగాడు.

పద్మావతి యూనివర్సిటీ ముఖద్వారం దగ్గర నిల్చున్న ఆడపిల్లలు కొందరు రోడ్డుపైన శవయాత్ర కనిపించగానే లోపలికి పరుగెత్తారు. ద్వారం పక్కన ఆటోలనాపుకుని నిల్చున్న డ్రైవర్లు ఊరేగింపును నిర్లిప్తంగా చూడసాగారు. రోడ్డుకు తూర్పువైపున వున్న బంగళాలో మనుషులున్న సందడి కానరావడం లేదు.

తుమ్మలగుంట కూడలిని చేరుకున్నాక బాగా ముందుకెళ్లిపోయిన పలకలవాళ్లను వెనక్కు రమ్మని వో ముసలాయిన కేకేశాడు. రోడ్డుపైకి దింపిన శవం పక్కన పూలగంపను పెడుతూ, "దింపుడుకళ్లంరా! వచ్చి కర్పూరం ముట్టించు," అన్నాడు గంగయ్య.

నర్సింహులు కర్పూరం వెలిగిస్తూ శవంకేసి చూసి, "ముసిలోడే!" అని పెదవులు చప్పరించాడు. గంగయ్య ఇంటిగల్లాయిన దగ్గరకెళ్లి వినయంగా వంగి, "తలకొరివి తెస్తా వుండే పెద్దాయిన కొడుకుతో చెప్పి పాతగుడ్డలు యినాం దీసియ్యాల సామీ!" అని అడిగాడు.

నర్సింహులు కర్పూరం కొంచెం కొంచెంగా ముట్టించు. మీదేం పొయ్యింది? తెచ్చిందంతా ఇక్కడ్నే ముగించేసి మళ్లా తెమ్మంటారు అని హెచ్చరించాక ఇంటిగల్లాయిన, "వాడు కొడుకుగాదు. పాతగుడ్డలు కావాలంటే ముసిలాయన్నే అడగాల," అన్నాడు.

"అయ్యయ్యో! మొగబిడ్డలు లేరా?" అంటూ గంగయ్య దెబ్బ తగిలినట్టుగా బాధపడసాగాడు.

"కొడుకెందుకు లేడు? లక్షణంగా వుండాడు అమెరికాలో. అక్కడ్నించీ దుడ్డు వస్తావుండంగానే ఇక్కడిట్లా సావులు గూడా ఆర్భాటంగా జరగతా వుండాయి..." అని ముఖం ముడుచుకున్నాడు ఇంటిగల్లాయిన.

శవం పక్కకు వెళ్లాక, "పేరు పెట్టి పిలవాలన్నా! పేరేందో చెప్పండి," అని అడిగాడు నర్సింహులు.

గుంపు లోంచి, "పరశురామ్మూర్తి... పరశు రామ్మూర్తి," అని జవాబు వచ్చింది.

నర్సింహులు శవం చెవి దగ్గరికి వంగి, "పరుశు రామ్మూర్తీ! పరశురామ్మూర్తీ! పరశురామ్మూర్తీ!" అని పిలిచాడు, మొత్తం మూడుతూర్లు. "ఈ లోకంలో ఋణం వుంటే లేచి కుచ్చుంటాడు. లేకపోతే నమ్మకంగా కాటికెత్తుకొని పోవచ్చు!" అని జనంకేసి దర్పంగా చూశాడు.

శవాన్నెత్తుకున్న మనుషుల వెనుక చిన్నగుంపు నివ్వెరపోతూ మళ్లీ కదిలింది. ఇంటిగల్లాయన కోపంగా చూస్తూ కనిపించగానే గంగయ్య పూలమాలల తుంటల్ని శవం పైకి విసిరేయసాగాడు.

వుప్పరపల్లె స్మశానం దగ్గరికెళ్లాక నర్సింహులు నాలుగు బాంబుల్ని వరుసగా పేల్చాడు. పలకల వాళ్లు రోడ్డు పక్కనున్న కంచెలోంచి నాలుగు కంపల్ని బయటికి ఈడ్చి, కాలిబాట గుండా స్మశానంలోకి దారి తీశారు. అంతవరకూ స్మశానంలోని ఇనుపరేకుల షెడ్డు కింద కూర్చుని ఎదురుచూస్తున్న ఇద్దరు వ్యక్తులు పైకి లేచారు. అప్పుడే తవ్విన గుంత పక్కనున్న మట్టిదిబ్బ పైకి శవాన్ని చేర్చారు.

స్మశానాన్ని ఆనుకుని నాలుగైదు గుడిసెలు, రెండు మూడు మిద్దెలు వున్నాయి. వాటిపక్కన పొడవాటి సిమెంటు స్తంభాలపైన నీళ్ల టాంకరొకటి రొమ్ము విరుచుకుని నిలబడి వుంది. స్మశానానికి దక్షిణంగా ఇసుకను పోగొట్టుకున్న పిల్లకాలవొకటి గుంతల లోపల దాక్కొంటోంది. అప్పుడే తవ్విన గోతి పక్కన, పంచెలు పైకెత్తి కట్టుకున్న ఇద్దరు నల్లటి వ్యక్తుల్ని చూసి తల పంకిస్తూ, "కాట్లో తావు లేకుండా పోతావుండాదంట! ఈ తావులో ఇంకపైన పూడ్చేది లేదనీ, కాల్చాల్సిందేనని ఆ పక్క బోర్డేసుండారు," అన్నాడు గంగయ్య.

''కాట్లో గూడా ఇండ్లు గట్టేస్తే ఇంగ తావెట్ల మిగులుతుంది? పోలీసోల్తో చెప్పి వాళ్లనంతా బొక్కల్లోకి తోసేయించాల,'' అన్నాడు నర్సింహులు కసిగా.

''ఛత్... గొమ్మునుండు. వాళ్లెవురనుకోనుండావు? మన మోహన్రెడ్డన్న మనుషులు. ఆయన జెప్తే వూరికి నడిమధ్యలో వుండే మటం మనుషులే తోకలు ముడుచుకుంటారు. ఇదంతా డీకేటీ... ఇదొక లెక్కా?'' గంగయ్య రోషంతో మీసం మెలేశాడు.

ఎండ పెళపెళగాయడంతో మనుషుల నీడలు వాళ్ల పాదాల కింద దాక్కుంటున్నాయి. ఇనుపరేకుల షెడ్డులోకి ఆరేడుమంది మనుషులు చెమటలు కక్కు కుంటున్నారు. స్మశానానికి అవతల ఇండ్లమధ్యలోంచి నీళ్లబిందెను మోసుకెళ్తున్న పదేళ్ల అమ్మాయి ఇటుకేసి తల తిప్పడం లేదు. గోతికి పదిబారల దూరంలో వున్న ఇంటిలోపలి నుంచి టీవీ శబ్దం స్పష్టంగా వినబడు తోంది.

శవం చుట్టూ నిల్చున్న వ్యక్తులు ఏవో క్రతువులు చేసుకుపోతున్నారు. గుంత దగ్గరి నుంచి పరిగెత్తుకొచ్చిన నల్లటి మనిషి గంగయ్య దగ్గరి నుంచి కత్తిని తీసు కున్నాక, ''గుంతలోకి పోసేదానికి బియ్యం దెచ్చేది మరిచిపోయినారంట! మనం గెవనం జెయ్యలేదని ఆ మనిషి ఆగమాగం జేస్తావుండాడు. గుంతను పొడుగ్గా లోతుగా తొగలేదని ఎగిరి దూంకతా వుండాడు,'' అంటూ అనుకోని ప్రశంసలకు ఆనందపడుతున్న వాడిలా నవ్వసాగాడు. తరువాత పంచెకిందున్న డ్రాయరు జేబులోంచి రెండు చిన్న సీసాలు పైకి తీసి, ''ఇది మీ ఇద్దరి భాగం,'' అన్నాడు.

''మీరిద్దరూ రెండు ఫుల్లు బాటిల్లు గొట్టేసినారా?'' అనుమానంగా అడిగాడు గంగయ్య.

''ఫుల్లు గొడితే గొంత తొగేకయితిందా?'' అతను పెద్దగా నవ్వేశాడు.

నర్సింహులు తన సీసా మూత తీసి వాసన చూస్తూ, ''అర్ధమైనా గొంతు దిగితేగానీ మీకు కాట్లోకి దిగేదానికి ధైర్నం రాదు. గుంత తొగతా ఇంకో సగం పీల్చేసుంటారు. వొట్టి బెదురుగొడ్లు గదరా మీరిద్దరూ!'' అని చెప్పాక ఇద్దర్నీ పేరుపేరునా పిలుస్తూ ప్రేమగా బూతులు అందుకున్నాడు.

తుమ్మలగుంట వైపు నుంచి వచ్చి ఆగిన మోటారుసైకిలును చూడగానే గంగయ్య దిగ్గున పైకి లేచి, ''మోహన్రెడ్డన్న!'' అని ప్రకటించాడు.

తనపక్క కొచ్చి నిల్చున్న మనిషిని గమనించ కుండా, ''ఇంకా ఎంతసేపు పడుతుంది?'' అని అడిగాడు మోహన్‌రెడ్డి.

''అయిపోయిందన్నా! ఇంగేముండాది? పూడ్చే సేదే!'' అన్నాడు గంగయ్య. ఎంతకూ అతను తనకేసి తిరిగి చూడకపోవడంతో, ''అన్నా! అన్నా! ఇంటికాడికి చానా తూర్లు వచ్చుంటిని...'' అని గునిశాడు.

''వుద్యోగాలు చెట్లకు గాస్తా వుండాయారా?'' మోహన్‌రెడ్డి విసుక్కున్నాడు.

''ఏదో ఒక చిన్న బిల్లేసుకునే వుద్యోగమైనా... అందుకనే మూడువేలు...''

''సర్లే చూస్తాలే! ముందు వాళ్లను బిన్నాగా పూడ్చ మను. నేను పోవాల్ల...''

గంగయ్య గస బోసుకుంటూ గుంత దగ్గరికి పరుగెత్తి, ''అన్నకు పనుండాదట. బిన్నాగా పూడ్చండి,'' అని అరిచాడు.

నర్సింహులు స్మశానంలోంచి రోడ్డుపైకి పాకు తున్న కాలిబాట పైన సవకాన్ని పరిచి, అది గాలికి ఎగిరి పోకుండా నాలుగుమూలల్లో నాలుగురాళ్లు పెట్టాడు. చిన్నబ్బ దాని దగ్గరి కొచ్చి, పలకపైన రెండు దరువులు వాయించి, ''గుంత యినాం సామీ! గుంత యినా మన్నా! అందురూ చిల్లరేసే గావాల్ల,'' అని దండోరా వేశాడు.

గంగయ్య మళ్లీ మోహన్‌రెడ్డి దగ్గరికొచ్చి, ''చచ్చి పోయిన పెద్దాయినకూ, మీ నాయినకూ భలే స్నేగిత మంట గదన్నా! గెవనం బెట్టుకొని కాటికాడిక్కూడా వచ్చి నావు. ఎంతయినా నీది పెద్దమనసు,'' అని మెచ్చు కున్నాడు.

మోహన్‌రెడ్డి ముభావంగా, ''యినగాదు ఫ్రెండు. ఆయిన కొడుకు నాకు ఫ్రెండు. అమెరికాలో వుండాడు,'' అన్నాడు. తరువాత తనను మోటరుసైకిలు పైన తీసుకొచ్చిన వ్యక్తికేసి తిరిగి, ''నేను దగ్గరలేకుంటే వీళ్లు యే పనిగానీ సక్రమంగా జెయ్యరని రాహుల్ అన్ని తూర్లు ఫోనుజేసి చెప్పిందిందుకే! వాళ్లను జూడు. గుంత గూడా సరైన తావులో తవ్వలేదు,'' అన్నాడు విసుగ్గా.

''వచ్చి రెండు పిడికిల్లు మన్నేసి పోన్నా!'' అంటూ స్మశానంలోంచి పిలుపొచ్చింది. మోహన్‌రెడ్డి కంటే ముందుగా గుంత దగ్గరికి పరుగెత్తిన గంగయ్య పారతో మట్టిని కుప్పగా తోసి, ''ఇదెత్తుకోన్నా!'' అని ప్రాధేయ పడ్డాడు. మోహన్‌రెడ్డి చేతికంటిన మట్టిని రుమాలుతో తుడుచుకుంటూండంగా, ''అంతా ఋణం... ఎవు రెవురి ఋణం వాళ్లు తీర్చుకోవలసిందే!'' అంటూ గంగయ్య నిట్టూర్చాడు.

నర్సింహులు కాలిబాటపైన వస్తున్న మనుషుల కంతా అడ్డు తగులుతూ, "గుంత యినాం... గుంత యినాం..." అని గెంతసాగాడు. నల్లటి మనిషొకడు మిగిలిన మట్టినంతా గుంతపైకి తోసి, సమాధిని ముక్కోణాకారంలో మెత్తసాగాడు.

పలకలు దబదబా మోగుతుండగా గంగయ్య ఇంటిగల్లాయిన దగ్గరికొచ్చి, "మాకియ్యాల్సిన డుడ్డు ఇక్కడ్నే ఇచ్చేయాల్ల సామీ! అదే సాంగెం!" అని అడిగాడు.

సవకంపైకో పదిరూపాయల కాగితాన్ని విసిరిన మోహన్‌రెడ్డి, "ఈ మాలోళ్లకు మందెక్కువయి నట్లుం డాది. గుండం దొక్కినట్టుగా ఎగరతా వుండారు," అన్నాడు.

రత్నయ్యా, చినబ్బా పలకలు మోగిస్తుండగా మరో ఇద్దరు యువకులు పాంటులు పైకి మడుచు కుని ఇష్టం వచ్చినట్లుగా ఎగురుతున్నారు.

"ఆ తెల్లపాంటోడు నా కొడుకన్నా! ఆ బులుగు పాంటోడు మా గంగని చిన్న కొడుకు కోదండడు. ఇప్పుడే వచ్చినారు వాళ్లిద్దరూ. ఆ కోదండని కోసరమే గంగడు వుద్దోగమడిగుండేది," అన్నాడు నర్సింహులు వుత్సాహంగా.

మోహన్‌రెడ్డి నల్ల కళ్లద్దాలలోంచి చూపులు తిప్పి, "వాడేనా కాలేజీలో చదివింది?" అని అడిగాడు.

"వాడేన్నా! వాడే!" అంటూ వుద్వేగంతో జవాబు చెప్పబోయిన గంగయ్య సందేహిస్తూ ఆగిపోయాడు.

"ఎవురెవురు ఏ పని జెయ్యాల్నో పెద్దోళ్లు యిలా విరిగా జెప్పేసి పోయిందెందుకన్నా? వుద్దోగం వచ్చినా గూడా కులకట్టు తప్పగూడదు గదన్నా! ఎవురిదాకానో ఎందుకు? మీ నాయిన పోతానే ఆ పనులంతా నీకు చుట్టుకోలేదా? వూరి కోసమని చిన్నవాయిసులోనే నువ్వు మేడి పట్టుకోలేదా?"

మోటరుసైకిలు కదులుతుండగా, "ఇంకో మూడువేలు సర్దుకున్నాక గనబడు," అన్నాడు మోహన్ రెడ్డి. తడబడుతూ ఏదో చెప్పబోయిన గంగయ్య మాటలు గొంతు దాటి రాలేదు.

"వీళ్లిద్దరూ తొలి సినిమా జూసుకోని ఇంటికి పోతా ఇట్లొచ్చినారు. ఎస్వీనగరమోళ్లు అంపించిన అడ్వాన్సుతో మూడుసీసాలు తెమ్మని వాళ్లను అడుక్కు న్నాము. తెస్తాతెస్తా వీళ్లు దోవలోనే కొంచెం ఖాళీ జేసు కొని వచ్చినారు. పలకలు వాయిస్తా వుంటే ఇంక వాళ్లను పట్టేదాని కెవురివల్లయితాది?" సమాధి పని పూర్తిచేసిన మనిషి రోడ్డు పైకొచ్చి, కదం తొక్కుతూ చెప్పుకు పోయాడు.

పలకలు మోగిస్తున్న వ్యక్తుల పక్కన, ఇదివరకూ అడుగేస్తున్న ఇద్దరు యువకులతో బాటు, మరో ఇద్దరు మనుషులు వూడిపోతున్న పంచలనూ, భుజాల పై నుంచీ జారిపోయిన సవకాలనూ పట్టించుకోకుండా ఎగురుతున్నారు.

స్మశానం నుంచి రోడ్డుపై కొచ్చిన వాళ్లందరూ నిశ్శబ్దంగా తిరుగుదారి పడుతున్నారు. ఇంటిగల్లాయన ఇస్తున్న డబ్బులు చాలవన్నట్లుగా తల ఊపుతూ పలకల వాళ్లు దరువేస్తున్నారు. గుంపులోంచి వచ్చిన యువకుడొకడు కోపంగా రుసరుసలాడుతూ రెండు నోట్లు తీసి వాళ్లముందుకు చూపాడు. అతడి దగ్గర డబ్బులు తీసుకున్నాక గంగయ్య గబగబా కంచె పక్క నున్న చెట్టు చాటుకెళ్లాడు. జేబులోని సీసాను తీసి కళ్లు మూసుకుని గుటగుటా తాగేశాడు. ఖాళీసీసాను రొంపిలో చెక్కుకున్నాక తమవాళ్లకేసి మిర్రిమిర్రి చూశాడు.

పలకలు వాయిస్తున్న వాళ్ల చొక్కాల బొత్తాలూడి పోయి, గాలిలో ఎగురుతున్నాయి. ఎండకు కరిగిన తార్రోడ్డు పైన వాళ్ల పాదాల ముద్రలు స్పష్టంగా పడు తున్నాయి. తన చేతిలోని సంచిని రోడ్డుపక్కన వుం చేశాక, నర్సింహులు గంగయ్యకేసి చూసి, అదోలా నవ్వి, చేతులు పైకెత్తి కాళ్లు జాడించి రెండడుగులు వేశాడు. గంగయ్య అతడికేసి కోపంగా చూడబోయి, అంతలో సిగ్గుపడిపోయి, మరు నిముషంలో పరవశం గా నవ్వేసి, వుద్వేగంతో ముందుకు దూకాడు. అతడి రొంపిలోని సీసాలు రెండూ రోడ్డుపైన పడి బాంబుల్లా పగిలాయి. ఎగురుతున్న వాళ్లంతా వులిక్కిపడి తిరిగి చూశారు. అదేమీ పట్టించుకోకుండా అడుగేస్తున్న గంగయ్య కనబడగానే వాళ్లందరూ గొల్లున నవ్వుతూ శక్తికొద్దీ పైకెగిరి దూకారు. మోటరుసైకిలు తుమ్మల గుంట వైపుకు పరిగెడుతోంది. ఎస్వీనగర్ మనుషులు రోడ్డుపైన పడమటివైపుకు నడుస్తున్నారు.

స్మశానానికెదురుగా, కాలి రగిలిపోతున్న తార్రోడ్డు పైన, పలకల రొదా, మాలవాళ్ల ఉన్మాదపు చిందూ సాగిపోతూనే వున్నాయి.

*నవ్య వారపత్రిక, 12 మార్చి 2008*